రైతు సంక్షేమానికి సర్కారు ప్రాధాన్యం

- అన్నదాత బాగుంటేనే ఊరు బాగుంటది.
- తెలంగాణను కాపాడుకుందాం
- 100 కి.మీ. నుంచి రాచాలకు కృష్ణాజలాలు
- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

రాచాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 1 : ''రైతులు బాగుంటేనే ఊరు బాగుంటుందనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన.. అందుకే వారికి కోతలు లేని కరెంటు ఇచ్చిండు, తర్వాత పె ట్టుబడికి ఇబ్బంది పడొద్దని రైతుబంధు ఇచ్చిండు..'' అని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కందూరు అనుబంధ గ్రామం గౌరిదేవునిపల్లికి వెళ్లేందుకు పెద్దవాగుపై రూ.2.35కోట్లతో నిర్మించిన కాజ్‌వే (వంతెన)ను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంత రం ఆయా గ్రామాల్లో చెక్‌డ్యాం పనులకు భూ మిపూజ, సామూహిక భవనాల ప్రారంభం, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, పాఠశాల భవనాలను ప్రారంభించారు. అనంతరం రాచాలలో 28మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్స్, 10మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ చావు అంచుల దాకా వెళ్లి తెలంగా ణ రాష్ట్రాన్ని సాధించారని, కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఆగం కావొద్దనే రైతు సంక్షేమానికే ప్రభుత్వం ప్రా ధాన్యం ఇచ్చిందన్నారు. 100 కి.మీ. నుంచి కృష్ణా జలాలు పెద్దవాగు ద్వారా రాచాలకు చేరుకోవడమే అందుకు నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులతోపాటు ఉద్యోగులు, యువకులు, రైతులు, మహిళలు ఎంతోమంది లా ఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్లారని, వందలమంది విద్యార్థులు ఆత్మబలిదానం చేసుకున్న తర్వాతనే తెలంగాణ వచ్చిందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కేసీఆర్‌కు మద్దతుగా మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నృత్యం చేయగా ఎమ్మెల్యే అభినందించి వారికి ఉద్య మ గేయాలు నేర్పించాలని సూచించారు. అనంతరం పాఠశాల తరపున ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాధిక, ఎంపీడీవో మంజుల, సింగిల్‌విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, కందూరు ఆలయ చైర్మన్ రమేశ్‌గౌడ్, స ర్పంచులు జయన్నగౌడ్, శ్రీకాంత్, క ల్పన, తిరుపతయ్యయాదవ్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాచాల ఓటు.. కారు గుర్తుకే

రాచాల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ తిరుపతయ్యయాదవ్ మాట్లాడారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించి మరిన్ని పనులు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పనులు మాత్రమే అడుగుతారా, ఈ సారైనా కారు గుర్తుకు ఓటేస్తారా? అని అడిగారు. ఈక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధికి కృతజ్ఞతగా గతానికి మించి గ్రామం తరపున 99శాతం ఓట్లు కారు గుర్తుకే వేస్తామని ప్రకటించారు. ఇందుకు సర్పంచ్‌ను ఎమ్మెల్యే అభినందిస్తూ ఇతర పార్టీలో ఉన్నా.. గ్రామ అభివృద్ధికి కృతజ్ఞతగా కారు గుర్తుకు ఓట్లు వేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. తాను కూడా గ్రామాభివృద్ధికి కంకణ బద్ధుడినై ఉంటానని వారికి హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళలతో మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

మహిళా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- బీఆర్‌ఎస్‌లో చేరిన వివిధ గ్రామాల మహిళలు
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 1 : మహిళా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని, వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మల్దకల్, ధరూర్ మండలం అల్లపాడ్, నెట్టెంపాడ్, నాగర్‌దొడ్డి, మార్లబీడు, కొత్తపాలెం గ్రామాలకు చెందిన పలు సంఘాల మహిళా నాయకురాళ్లు రూతమ్మ, సరోజమ్మ, భాగ్యమ్మ, పద్మమ్మ, జయలక్ష్మి, సరోజమ్మ, అంజనమ్మ, అనిత, శోభ, మాధవితోపాటు సుమారు 100మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తన సతీమణి జ్యోతితో కలిసి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత పాలకులు మహిళలను వంటింటికి పరిమితం చేసి ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని వారి సంక్షేమాన్ని విస్మరించారన్నారు. తెలంగాణ సిద్ధించాక సీఎం కేసీఆర్ సారథ్యంలో మహిళల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రవేశ పెట్టామని, ఒంటరి మహిళలకు పింఛన్ అందజేస్తున్నామన్నారు. షీటీంలతో వారికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు పెంచి చేయూతనిచ్చారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గద్వాలలో తనను గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే సతీమణి జ్యోతి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మహిళల్లో రక్తహీనతకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్ అందజేస్తుందని వివరించారు. విద్యార్థినుల చదువు కోసం రాష్ట్రంలో గురుకులాలు ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, నాయకుడు వెంకట్రాములు, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే చేతివృత్తులకు గుర్తింపు

- అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం
- రూ.4కోట్లతో కమ్యూనిటీ హాల్స్‌కు శ్రీకారం: ఎమ్మెల్యే అబ్రహం

బీసీ కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి, అక్టోబర్ 1 : తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రాధాన్యమిస్తూ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. రాజోళిలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.4కోట్లతో కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలో కులవృత్తులకు గుర్తింపు లేదని, తెలంగాణ ఏర్పాటయ్యాక ప్రభుత్వం వారికి అండగా నిలిచిందన్నారు. కాంగ్రెసోళ్ల హామీలు గాలిలో కట్టే మేడలేనని ఎద్దేవా చేశారు. ఆ నాయకులకు తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదని, వారి మాటలు ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు అండగా ఉంటూ ఆయనకు హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టాలని కోరారు. అందరి సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి ముందుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తేవాలని, మధ్యవర్తులను ఆశ్రయించొద్దని సూచించారు. అనంతరం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుగుణమ్మ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, వైస్ ఎంపీపీ రేణుక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, ఉప సర్పంచ్ గోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యవారి పల్లిలో జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

'పాలమూరు'తో సస్యశ్యామలం

- గ్రామాల దశ మార్చినం
- సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిలకొండ, అక్టోబర్ 1 : పాలమూరు ఎత్తిపోతల పథకంతో గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అయ్యవారిపల్లి, కానుగుబండతండా, ఉబ్బిడితండా, పలుగుతండా, చింతల్‌తండా, మోదీపూర్, నల్లవెల్లి, అభంగపట్నం, రాజునాయక్‌తండాలో ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంబోత్సవాలు చేసి మాట్లాడారు. అభివృద్ధి పథకాల అమలుతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం దశ మార్చామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జీపీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. నల్లవెల్లి, అభంగపట్నంలో పంచాయతీ భవనాలను అద్భుతంగా నిర్మించడంపై సర్పంచులు ఆంజనేయులు, మాధవిరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం మోదీపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో రూ.50లక్షలతో నిర్మిస్తున్న కల్యాణ మండప పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరామకొండ ఆలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కృష్ణయ్యయాదవ్, రైతుబంధు కన్వీనర్ మల్లయ్యయాదవ్, సర్పంచులు విజయశ్రీ, అనిత, శాంతిబాయి, స్వప్న, ఆంజనేయులు, మాధవిరెడ్డి, సక్రియాబాయి, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేద్దాం

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

హైదరాబాద్‌లోని అల్వాల్ గ్రీన్ కాలనీలో గద్దర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీరం

కొల్లాపూర్, అక్టోబర్ 1 : అందరి ఆశీర్వాదంతో కొల్లాపూర్ గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురవేద్దామని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని అల్వాల్ గ్రీన్ ఫీల్డ్ కాలనీలో నివసిస్తున్న కొల్లాపూర్‌కు చెందిన 20 గ్రామాల ప్రజలతో నల్లపోచమ్మగుడి ప్రాంతంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మె ల్యే పాల్గొని ప్రజాగాయకుడు గద్దర్ విగ్రహానికి పూలమాల వే సి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలు చల్లి పటాకులు కాల్చుతూ స్వాగతం పలికారు. తనపై వలస కూలీలు చూపిన అభిమానానికి ఎమ్మెల్యే ఫిదా అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఆశీర్వదించిన అందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న పేద కుటుంబాలు ఉంటే పేర్లు ఇవ్వాలని, వారందరికీ తప్పకుండా ఇండ్లు మంజూరయ్యేలా చేస్తామన్నారు. గతంలో వలసలకు ఉమ్మడి పాలమూ రు జిల్లా కేంద్రంగా ఉండేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలతో పచ్చబడిందన్నారు. తనను ఆశీర్వదించిన అందరికీ అండగా ఉంటానని, గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ పక్కా..

- ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా విజయం ఖాయం
- రూ.70కోట్ల పనులను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 1 : ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలంతా సీఎం కేసీఆర్ వైపే ఉన్నారని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ పక్కా అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలో రూ.70కోట్ల పనులకు మంత్రి ప్రారంభోత్సవం, భూమిపూజ చేశారు. పట్టణంలోని సర్వే నెంబర్ 99లో రూ.17.5కోట్లతో చేపట్టనున్న వంద పడకల దవాఖాన నిర్మాణానికి భూమిపూజ, రూ.45కోట్లతో చేపట్టనున్న మిషన్ భగీరథ యూనిట్, రూ.10కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సెగ్రిగేషన్ షెడ్డును ప్రారంభించారు. అనంతరం పట్టణంలో పీఏసీసీఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

సభలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మ్యానిఫెస్టోతో దిమ్మ తిరగాలె..

- కాంగ్రెస్‌కు తప్పిపోయి ఓటేస్తే గోస తప్పదు
- సీట్లను అమ్ముకున్నట్లు వాళ్లు రాష్ట్రాన్ని అమ్ముకుంటారు
- కాంగ్రెస్ వస్తే రైతుబంధు, రైతుబీమా ఉంటుందా..?
- గిరిజన యూనివర్శిటీ విభజన చట్టంలోనిదే..
- ప్రధాని మోదీ.. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ గురించి చెప్పాలి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

దేశం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటుంది

నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ (అక్టోబర్ 1) : త్వరలో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో తయారు చేస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ''ఎన్నికల్లో గెలిపిస్తే ఐదేండ్లల్లో పాలమూరు ఎత్తిపోతలను పూర్తి చేస్తానన్న మోదీ ఎందుకు పూర్తిచేయలేకపోయారు? విభజన చట్టంలో ఉన్న గిరిజన యూనివర్సిటీని తొమ్మిదేండ్లపాటు నాన్చి ఇప్పుడు కొత్తగా ఇస్తున్నట్లు ప్రకటించడం సరికాదు.. అదే చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ గురించి చెప్పాలి'' అని మంత్రి డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, ఆమనగల్లులో దవాఖాన పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం కల్వకుర్తిలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో మంత్రి ప్రసంగించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక మహిళలు, వితంతులు, వృద్ధులు, యువత, రైతులకు ఏం చేయాలో మ్యానిఫెస్టోలో పేర్కొన్నామన్నారు. మహారాష్ట్రతో పాటు దేశ ప్రజలు తెలంగాణలోని పథకాలు కావాలని రోడ్లమీదకు వచ్చి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుతున్నారన్నారు. దేశంలో రైతుల కోసం ఉన్న ఒకే ఒక్క నాయకుడు సీఎం కేసీఆర్ అని స్పష్టం చేశారు. కేసీఆర్ అంటే మాట తప్పనివాడు, మడమ తిప్పని వాడు అని కొనియాడారు. కేసీఆర్ వల్ల తెలంగాణ వస్తదని ఎవ్వరూ అనుకోలేదని, వస్తే జైత్రయాత్ర, లేకుంటే శవయాత్రంటూ ఢిల్లీని కదిలించి తెలంగాణ తెచ్చింది కేసీఆరేనన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి కాకుండా కాంగ్రెసోళ్లు భూసేకరణను అడ్డుకున్నా, ఎన్ని అడ్డంకులు సృష్టించి కేసులు వేసినా సీఎం కేసీఆర్ ప్రాజెక్టును పూర్తి చేసి ఇటీవల ప్రారంభించారన్నారు. ఆ నీళ్లు వస్తే కల్వకుర్తిలో లక్షా యాభైవేల ఎకరాలతో రెండు పంటలు పండుతాయన్నారు. ఇదంతా జరగాలంటే కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలన్నారు. ప్రధాని మోదీ ఐదేండ్ల క్రితం వచ్చి మమ్మల్ని గెలిపిస్తే పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని చెప్పి ఎందుకు పూర్తి చేయలేదని? జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. నాలుగు చిలుక పలుకులు పలికారని, గిరిజన యూనివర్సిటీని కొత్తగా ఇచ్చేదేంటని, తొమ్మిదేండ్ల కిందటే తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ ఇవ్వాలని విభజన చట్టంలో పెట్టారన్నారు. ఇప్పుడొచ్చి యూనివర్సిటీ ఇస్తామంటూ చెవిలో పూలు పెడతారా? అని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మన కండ్లను మనమే పొడుచుకున్నట్లు అవుతుందన్నారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం కొట్లాటలు, ఎకరం భూమికి, రూ.పదికోట్లకు టిక్కెట్లను అమ్ముకుంటున్నారని, వారిని తప్పిపోయి గెలిపిస్తే తెలంగాణను కూడా అమ్ముకుంటారన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోసం కండ్లల్లో ఒత్తు లేసుకోవాల్సి వస్తుందని, ఎరువుల కోసం చెప్పులు క్యూలో పెట్టే పరిస్థితులు మళ్లీ వస్తాయన్నారు. కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని, ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతున్నదన్నారు. సీఎంగా కేసీఆర్ వచ్చాకే వైద్యరంగంలో ఎంతో ప్రగతి సాధించామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ ఖాయమన్నారు. పాలమూరు ఎత్తిపోతలతో ప్రజల కాళ్లు కడిగి వారి రుణం తీర్చుకుంటామన్నారు. సమిష్టిగా పని చేసి బీఆర్‌ఎస్‌ను, జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు మనుషులు లేరని, బీఆర్‌ఎస్ పక్కన పెట్టినోళ్లకు వాళ్లు టిక్కెట్లు ఇస్తున్నారని, ఇక్కడి చెల్లని నాణేలు అక్కడ చెల్లుతాయా అని ఎద్దేవా చేశారు. గతంలో నేనురాను బిడ్డో సర్కార్ దవాఖానకు అంటే.. నేడు నేను పోతాను సర్కారు దవాఖానకు అనే పరిస్థితులు వచ్చాయన్నారు. కరోనా పరిస్థితులు వచ్చినా పేదలను సీఎం కేసీఆర్ కడుపులో పెట్టుకొని కాపాడుకున్నడన్నారు. కాంగ్రెస్ హయాంలో అత్తా కోడళ్ల పంచాయతీలు ఉండేవని, ఆసరా పింఛన్ల పెంపు, పది కిలోల బియ్యంతో తగ్గిపోగా పేదలు, వృద్ధుల్లో ఆత్మగౌరవం నింపామన్నారు.

కశిరెడ్డిపై మంత్రి ఫైర్

ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డిపై మంత్రి మండిపడ్డారు. సీఎం కేసీఆర్ రెండుసార్లు టిక్కెట్లు ఇచ్చి ఎమ్మెల్సీని చేస్తే తల్లి గుండెల మీద తన్నినట్లుగా పార్టీని విడిచిపోతున్నాడని, అలాంటి వ్యక్తి రాబోయే కాలంలో కల్వకుర్తి ప్రజలను కూడా మోసం చేస్తారన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే ఉంటా.. లేకుంటే ఉండను అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏం చేసిందని కాంగ్రెస్‌లోకి పోతున్నావని కశిరెడ్డిని నిలదీశారు. కల్వకుర్తి పేరున్న ప్రాజెక్టుతో నీళ్లు అందించలేని పార్టీలోకి వెళ్తారా అని ప్రశ్నించారు. పెడితే పెండ్లి, లేకుంటే చావు కోరుతావా అని దుయ్యబట్టారు. గతంలో చంద్రబాబు కొబ్బరికాయ కొడితే, వైఎస్ పలకలు వేయడం, వైఎస్ కొబ్బరికాయ కొడితే చంద్రబాబు పలకలు వేస్తూ రాజకీయ డ్రామాలు నడిపారన్నారు. జైపాల్‌యాదవ్ బడుగుబలహీన వర్గాల నాయకుడని, సీఎం కేసీఆర్‌కు చాలా ఇష్టమైన నాయకుడన్నారు. అభివృద్ధే ధ్యేయంగా, శ్వాసగా పనిచేస్తున్న జైపాల్‌ను నాలుగోసారి గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జైపాల్ యాదవ్ కోరిక మేరకు కల్వకుర్తిలో వంద పడకలు, ఆమనగల్‌లో యాభై పడకల దవాఖాన పనులకు శంకుస్థాపన చేశామన్నారు. పాము కాటైనా, తేలు కాటైనా, బొక్కల డాక్టరైనా కల్వకుర్తిలోనే అందుబాటులో ఉంటారన్నారు. బీఆర్‌ఎస్ కల్వకుర్తి రూపురేఖలే మార్చిందన్నారు. సీఎం కేసీఆర్ వల్లే పాలమూరు ఎత్తిపోతల పథకంతో లక్షా యాభైవేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సీఎం కేసీఆర్ మళ్లీ గెలవాలన్నారు.

ఉమ్మడి పాలమూరు బీఆర్‌ఎస్‌దే..

ఉమ్మడి జిల్లాలో 14స్థానాలు బీఆర్‌ఎస్‌వేనని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే నాయకులకు కల్వకుర్తి ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నీరందించడంలో మంత్రి హరీశ్‌రావు కృషి ప్రశంసనీయమన్నారు.

వైద్యారోగ్య శాఖ పనితీరు మెరుగుపడింది..

స్వరాష్ట్రంలో వైద్యారోగ్యశాఖ పని తీరు మెరుగుపడిందని ఎంపీ రాములు అన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. కల్వకుర్తి గుండా మూడు జాతీయ రహదారులు వెళ్తున్నాయని, కల్వకుర్తికి బంగారు భవిష్యత్ ఉందన్నారు. అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌కు కల్వకుర్తి ప్రజలు అండగా ఉండాలని కోరారు.

డప్పు వాయిద్యాలతో మంత్రికి స్వాగతం పలుకుతున్న స్థానికులు, నాయకులు

నృత్యం చేస్తున్న గిరిజన మహిళ

డప్పు వాయిద్యాలకు నృత్యం చేస్తున్న ప్రజలు

మంత్రితో ముచ్చటిస్తున్న విప్ గువ్వల

మూడోసారి కేసీఆరే సీఎం..

వంద పడకల దవాఖాన నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను చేద్దామన్నారు. ఎమ్మెల్సీగా కశిరెడ్డి రెండు పర్యాయాలు పనిచేసి ఇప్పుడు వేరే పార్టీలో చేరడం తల్లి పాలుతాగి రొమ్ము గుద్దడమేనన్నారు. పార్టీలో 12 ఏండ్లుగా పనిచేస్తున్న తనను గుర్తించి సీఎం కేసీఆర్ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని పేర్కొన్నారు.

కల్వకుర్తి అభివృద్ధిలో ముందంజ..

ప్రాణం ఉన్నంత వరకు కల్వకుర్తి ప్రజలకు సేవ చేస్తానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వకుర్తి ప్రజలు చాలా చైతన్యవంతులని గుర్తు చేశారు. కల్వకుర్తి అభివృద్ధిలో చాలా ముందుందని, పట్టణం మీదుగా మూడు జాతీయ రహదారులు, ఆమనగల్ సమీపంలో రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నదన్నారు. ఎంజీకెఎల్ఐకి కల్వకుర్తి ఎత్తిపోతలగా నామకరణం చేసి రూ.565కోట్లతో ప్రాజెక్టు పనులు పూర్తి చేసి యాభైవేల ఎకరాలకు సాగునీరందిస్తున్నారని గుర్తు చేశారు. పీఆర్ఎల్ఐతో మరో 18నెలల్లో ఈ ప్రాంతంలో లక్ష ఎకరాలకు సాగునీరందనుందన్నారు. నియోజకవర్గంలో రూ. ఐదువేల కోట్లతో అభివృద్ధి జరగుతున్నదన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి ద్రోహం చేసినోళ్లను నమ్మొద్దని, వారికి డిపాజిట్లు కూడా రావన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్లేశం, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్, కల్వకుర్తి, ఆమనగల్లు ఏఎంసీ చైర్మన్లు విజయ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీలు వెంకటేశ్, విజితారెడ్డి, దశరథ్‌నాయక్, అనురాధ, ఎంపీపీ మనోహర, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.